పర్వతారోహకురాలు అన్వితారెడ్డికి నగదు ప్రోత్సాహకం


ఏజీఐ ఆధ్వర్యంలో రూ.3లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌రెడ్డి, వీరేశం

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 30 : పర్వతారోహకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత పడమటి అన్వితారెడ్డికి మండలంలోని తుక్కాపురం గ్రామ సమీపంలోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ రూ.3లక్షల ప్రోత్సాహకం అందించింది. సంబంధింత చెక్కును శుక్రవారం అన్వితారెడ్డికి ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సిబ్బంది గోవిందరాయ్, మయాంక్ పారిక్, శివరామ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

● మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

పదవీ విరమణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, ఆగస్టు 30 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మోట సత్తయ్య పదవీ విరమణ సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య తగ్గుదలకు కారణాలేమిటో ఆలోచన చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్నవారంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారేనని గుర్తు చేశారు. విద్య అనేది వ్యాపారం కాదు.. సేవ అని నిరూపించాలని, కమిట్‌మెంట్‌తో పని చేసే వారిని గౌరవించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోవాలని వినతి

చౌటుప్పల్, ఆగస్టు 30 : మున్సిపాలిటీ పరిధిలోని త్రిబుల్ ఆర్ జంక్షన్ భూ నిర్వాసితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి శుక్రవారం బాధితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏండ్ల తరబడి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న తమకు భూములు పోతే బతుకుదెరువు లేక రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. కోట్ల విలువైన భూములు తీసుకుంటే తమ పరిస్థితి ఏందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకుంటే భూముకి బదులు భూమి లేదా ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం 4నుంచి 5కోట్ల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూ నిర్వాసితులు జాల పెద్ద జంగయ్య, శ్రీశైలం, జంగయ్య, వెంకటేశం, యాదయ్య, బస్వయ్య, నర్సింహ, చిన్న వెంకటేశం, గాలయ్య, రంగయ్య, వేణు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరులో మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, ఆగస్టు 30 : ప్రతి కుటుంబం ఇంటింటా మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2వ వార్డుల్లో మొక్కలు పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు కారుపోతుల శిరీష, పురుగుల వెంకన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 30 : పట్టణంలోని నల్ల పోచమ్మ దేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. ఆలయంలో మూల మంత్ర హోమం, దిష్టికుంభం, బలిహరణం, పూర్ణాహుతి, మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగం, ఆశీర్వచనం, మహా అన్నప్రసాద కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కట్న కానుకలు సమర్పించారు. విగ్రహ దాతలు మెరుగు గోపాల్ యాదవ్, చైతన్యలత దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు కట్కూరి పాండురంగం, గౌరవాధ్యక్షులు కొయ్యడ నర్సింహ, గునిగంటి మల్లేశం, వెంకటేశం, భక్తులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వినతి

తాసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న వీఆర్‌పీ నాయకులు

మోత్కూరు, ఆగస్టు 30 : మున్సిపాలిటీలోని పెద్ద చెరువులో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని విద్యార్థుల రాజకీయ పార్టీ ఆధ్వర్యంలో తాసీల్దార్ రాంప్రసాద్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేశ్ మాట్లాడుతూ మోత్కూరు పెద్ద చెరువు 96.11 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉందన్నారు. చెరువు బఫర్ జోన్‌లో 60 మీటర్లకు లోబడి ఉన్న భూమిని కొందరు ఆక్రమించి అక్రమ పట్టాలు పొంది ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకొని విచారణ జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోమటి జనార్దన్, గుండు శ్రీనివాస్, దండ్ల కళ్యాణ్, పంజాల శ్రీను, బండారు చిరంజీవి, శేఖ రాచారి, సాయి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

పారుపల్లిలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న జై భీమ్ యూత్ సభ్యులు

రాజాపేట, ఆగస్టు 30 : మండలంలోని పారుపల్లిలో జైభీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పనున్న అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతీప్రవీణ్ మాట్లాడుతూ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జైభీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు వైభవంగా నిత్యోత్సవాలు


ఊంజల్ సేవోత్సవంలో భాగంగా అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి నిత్యోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీసమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతును జరిపారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్ఠించి కల్యాణ తంతును నిర్వహించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ప్రధానాయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలకరించిన అర్చకులు ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళనీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఉదయం నుంచి సాయం త్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అనుబంధ పర్వతవర్ధనీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్యపూజలు స్మార్తగమశాస్త్రరీతిలో జరిగాయి. పలువురు భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 15వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.29,99,608 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భూ అక్రమార్కుల భరతం పట్టండి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 30 : ప్రభుత్వ భూములు, చెరువు నాలాలు కబ్జా చేసిన అక్రమార్కుల భరతం పట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు కళ్లెం వీరారెడ్డి స్మారకార్థం నిర్మించిన పార్టీ భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చౌరస్తాలోని స్తూపానికి నివాళులర్పించారు. భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని, ఆ భూములను పేదలకు పంచాలని అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కమ్యూనిస్టు కార్యాలయాలు పేదల హక్కుల కోసం పోరాడే కేంద్రాలుగా ఉపయోగపడుతాయన్నారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా పేదల కోసం నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ కళ్లెం వీరారెడ్డి భూమి కోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన గొప్ప నాయకుడని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జంగారెడ్డి, పార్టీ జిల్లా నాయకులు కొండమడుగు నర్సింహ, గూడూరు అంజిరెడ్డి, దాసరి పాండు, మేక అశోక్‌రెడ్డి, నర్సింహ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 15న చేనేత కార్మిక సంఘం ఎన్నికలు

పద్మశాలి చేనేత కార్మిక సంఘం ఎన్నికల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 30 : పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో వచ్చే నెల 15న చేనేత కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పద్మశాలి చేనేత కార్మిక సంఘం భవనంలో ఎన్నికల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 15న ఉదయం 8నుంచి 4గంటల వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పద్మశాలీలు, చేనేత వృత్తి చేసేవారు, సంఘం సభ్యత్వం కలిగిన వారు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఎన్నికల్లో సంఘం అధ్యక్షుడితోపాటు 10మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారని, ఈ కమిటీ కాల పరిమితి మూడు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. అధ్యక్ష పదవికి పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ రుసుము రూ.2,500, కార్యవర్గ సభ్యుడి పదవికి వెయ్యి రూపాయలు ఎన్నికల నిర్వహణ కమిటీకి చెల్లించాలన్నారు. సెప్టెంబర్ 5న ఉదయం 10నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, 4గంటల తర్వాత నామినేషన్ల పరిశీలన, 6వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ఉంటుందని తెలిపారు. 15న ఎన్నికలు నిర్వహించి 16న లెక్కింపు చేపట్టి ఆ వెంటనే ఫలితాలు వెల్లడిస్తారని చెప్పారు. అధ్యక్ష అభ్యర్థులకు లైట్ బ్లూ కలర్ బ్యాలెట్ పేపర్, డైరెక్టర్లకు వైట్ కలర్, మహిళా డైరెక్టర్లకు లైట్ ఎల్లో కలర్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం ప్రధాన కార్యదర్శి భారత బాలరత్నం, చేనేత కార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, చేనేత నాయకులు చిక్క కృష్ణ, ఏలె భిక్షపతి, శ్రీహరి, శ్రీనివాస్, యాదగిరి, దయానంద్, బాలశంకర్, హరిశంకర్, ప్రవీణ్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

విద్యుత్ సౌధ ముట్టడిని విజయవంతం చేయాలి

● ఓసీ, బీసీ ఐక్య కార్యాచరణ సమితి

విద్యుత్ సౌధ ముట్టడి పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బీబీనగర్, ఆగస్టు 30 : విద్యుత్ ఉద్యోగులకు అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 4న చేపట్టే విద్యుత్ సౌధ ముట్టడిని విజయవంతం చేయాలని ఓసీ, బీసీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని పీఆర్‌జీ గార్డెన్‌లో శుక్రవారం ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఓసీ, బీసీ ఉద్యోగులకు హైకోర్టు ఉత్తర్వు ప్రకారం 2014 జూన్ 2నుంచి పదోన్నతులు కల్పించాలన్నారు. విద్యుత్ సంస్థలో అన్ని కేడర్లలో నేరుగా నియమింపబడుతున్న ఉద్యోగులను సీనియార్టీ, మెరిట్ ఆధారంగా హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్ కార్మికులకు ఏపీ రూల్స్‌ను వర్తింపజేసి అర్హత ఆధారంగా పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ ఆర్.కృష్ణయ్య, ఏఈ మనోహర్‌రెడ్డి, సబ్ ఇంజినీర్ రూపారెడ్డి, నాయకులు నరేశ్, బాల నర్సింహ, భూపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, జంగయ్య, రాజారత్నం, పరమేశ్ పాల్గొన్నారు.

మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆలేరు రూరల్, ఆగస్టు 30 : మహిళా శక్తిలో భాగంగా ప్రభుత్వం అందజేసే రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం మీనా అన్నారు. ఆలేరు మండల సమైక్య భవనంలో మహిళా సంఘాల సభ్యులకు పాడి గేదెలు, పేరటికోళ్ల పెంపకంపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గేదెలు, ఆవుల పెంపకం, వాటి నిర్వహణ జాగ్రత్తలపై వెటర్నరీ డాక్టర్ భాస్కర్ సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ వెంకటకిషన్‌రావు, సీసీలు సరస్వతి, శివకుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

తుర్కపల్లి, ఆగస్టు 30 : చదువు అగిపోయినవారు నేరుగా 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశం ఉందని, అందుకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ భిక్షమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకు వయస్సు రుజువు సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో తుర్కపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 30 : మండలంలోని చిన్నకొండూరు గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి గ్రామ ప్రత్యేకాధికారి పి.దీప శుక్రవారం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి సహకరిస్తున్న దివీస్ పరిశ్రమకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి టి.సురేశ్, గ్రామ నాయకులు శ్రీనాథ్, పెంటయ్య, నర్సింహారెడ్డి, పరిశ్రమ అధికారులు గోపి. సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్ కె.మాధవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఆత్మీయ సన్మానం

రామన్నపేట, ఆగస్టు 30 : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన మోటె సత్తయ్య స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి, మడూరి ప్రభాకర్‌రావు ఆయనను సన్మానించారు. సత్తయ్య భావి జీవితం సుఖ సంతోషాలతో, ఆయుఆరుగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 30 : మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త సయ్యద్ యూసుఫ్ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. కేహెచ్ ఆర్ ఫౌండేషన్ అందజేసిన రూ.5వేల ఆర్థిక సాయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు యూసుఫ్ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు కోల సత్తయ్యగౌడ్, పెండెం పురుషోత్తం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నరుకుడుబిందెల సైదులు, మండల కార్యదర్శి సోలిపురం రాంరెడ్డి, పాల సంఘం చైర్మన్ చుంచు మల్లయ్య, నాయకులు నాగరాజు, ఇస్తారి, గోపాల్ పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని చీకటిమామిడి గ్రామానికి చెందిన చిందం సాలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. యువజన సంఘాల నాయకుడు జూపల్లి శ్రీకాంత్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్య మిత్రలు

బీబీనగర్, ఆగస్టు 30 : తమ సమస్యలు పరిష్కరించాలని ఎయిమ్స్ దవాఖానలో ఆరోగ్య మిత్ర సభ్యులు పది రోజులుగా నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం చేపట్టిన నిరసనలో పలువురు మాట్లాడుతూ జీఓ 60 ప్రకారం వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీబీనగర్ ఎయిమ్స్ ఆరోగ్య మిత్ర సభ్యులు సోమారం శారద, బి.జ్యోతి, కె.జ్యోతి పాల్గొన్నారు.

వైద్య సేవల పటిష్టానికి ఆరోగ్య మందిర్

● అదనపు కలెక్టర్ గంగాధర్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 30 : వైద్య సేవల పటిష్టానికి ఆరోగ్య మందిర్ ఎంతగానో తోడ్పడుతుందని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. పల్లె దవాఖానల్లో పనిచేస్తున్న మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, డాక్టర్లకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. వైద్య సేవల పటిష్టానికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆధ్వర్యంలో 14రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం ఆఫీసర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శిల్పిని, అడిషనల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్, జిల్లా ఇమ్యూనేషన్ అధికారి డాక్టర్ రామకృష్ణ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వీణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మానసిక ఆరోగ్యం అవసరం

● జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ ప్రీతిస్వరూప్

మాట్లాడుతున్న జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ ప్రీతిస్వరూప్

యాదగిరిగుట్ట, ఆగస్టు 30 : విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యం ముఖ్యమని జిల్లా మానసిక వైద్యుడు డాక్టర్ ప్రీతిస్వరూప్ అన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు, కుటుంబ, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి – నివారణ అంశంపై కళాశాల ప్రిన్సిపాల్ పి.మంజుల అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక సమస్యలు ఎదురైనప్పుడు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలుపుతూ మానసిక పరిపూర్ణ వికాసం పెంపొందించుకునే మార్గాలను వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎక్స్‌టెన్షన్ అధికారి ఇస్తారి మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవాలని, పరీక్షలకు ఆత్మ విశ్వాసంతో ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని సూచించారు. ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను వినియోగించుకుని ఒత్తిడిని జయించి అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు. ఆత్మ నిగ్రహం పాటించి సెల్‌ఫోన్ వినియోగం మానుకోవాలని, విద్య పట్ల దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించాలన్నారు.

రైతు కుటుంబ నిర్ధారణ ప్రక్రియ పారదర్శకంగా చేయాలి

● జిల్లా వ్యవసాయాధికారి గోపాల్

ఆలేరు రూరల్ : శారాజీపేటలో రైతురుణమాఫీ సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాధికారి గోపాల్

యాదగిరిగుట్ట, ఆగస్టు 30 : రేషన్ కార్డు లేక రుణమాఫీ నిలిచిపోయిన రైతుల వివరాల నమోదు ప్రక్రియను పారదర్శంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. మండలంలోని చిన్నకందుకూరు గ్రామంలో శుక్రవారం రైతు కుటుంబ నమోదు ప్రక్రియను పరిశీలించారు. రుణమాఫీ కాని రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేస్తూ వారి కుటుంబ సభ్యులతో సెల్ఫీ ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. రైతు కుటుంబ ధ్రువీకరణ పత్రాన్ని యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కుటుంబ నిర్ధారణ ప్రక్రియను ఇబ్బంది కలుగకుండా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ సుధారాణి, ఏఈఓ మౌన్యారెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ఆలేరు రూరల్ : రైతు రుణమాఫీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఏఓ గోపాల్ అన్నారు. మండలంలోని శారాజీపేటలో రైతు రుణమాఫీ సర్వేను పరిశీలించి మాట్లాడారు. రుణమాఫీ వర్తించని రైతులు ఎక్కువ సంఖ్యలో ఉన్నందున కుటుంబ యజమానుల ఫొటోలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆయన వెంట ఏఓ శ్రీనివాస్, ఏఈఓలు నాగార్జున, శివకుమార్ పాల్గొన్నారు.

రేషన్‌కార్